# 10. సమత్వ స్థితి

ఓ దిగంబర స్వామి ఎలాంటి విచారం లేకుండా ఎప్పుడూ చాలా ప్రశాంతంగా వుంటాడని ఒకామె విన్నది. ప్రశాంతంగా వుండే ఆ చిట్కా తెలుసుకుందామని ఆమె అతని దగ్గరకి వెళ్ళింది. ఆతన్ని చూసి ఇలా అడిగింది.

"నేను విన్నది నిజమేనా స్వామి? మీరు సదా చిరాకు లేకుండా ప్రశాంతంగా వుంటారా?"

"అవును. అది నిజమే." బదులు చెప్పాడతను.

"చూస్తే మీ ఒంటి మీద బట్టలేదు. మీకు ఇల్లు లేదు. నా అనేవారు లేరు. ఎవరైనా పెడితేనే మీరు తినగలిగేది. ఈ స్థితిలో మీరు ఎలా నిర్వికారంగా వుండగలుగుతున్నారు స్వామి?" ఆశ్చర్యంగా ప్రశ్నించిందామె.

"అమ్మా! ఈ ప్రపంచంలోని అత్యంత ఖరీదైన పట్టుచీరని నీకిస్తే అప్పుడు నీకు ఆనందం కలుగుతుందా?" ప్రశ్నించాడు దిగంబర స్వామి.

"కలుగుతుంది స్వామి." జవాబు చెప్పిందామె.

"సరే. అది కట్టుకున్న రోజు నీ భర్త మరణించాడు. అప్పుడు కూడా నీకు ఆ పట్టుచీర ఆనందాన్నిస్తుందా?"

"ఇవ్వదు స్వామి. దాన్ని చూసినప్పుడల్లా నాకు దుఃఖం కలుగుతుంది."

"నీకా పట్టుచీర ఓ రోజు సంతోషాన్ని ఇచ్చి, ఇంకో రోజు దుఃఖాన్ని ఎందుకు కలగచేసింది?"

"నాకు సుఖదుఃఖాలని ఇచ్చింది ఆ పట్టుచీర కాదు స్వామి. నా పరిస్థితులే." చెప్పిందామె.

"సరే. ఆ పరిస్థితుల్లో నీకు సుఖదుఃఖాలు ఎక్కడ కలుగుతున్నాయి? కాల్లోనా? చేతుల్లోనా? పొట్టలోనా?"

"నా మనసులో స్వామి."

"అంటే ఆనందాన్ని లేదా దుఃఖాన్ని అనుభవించేది నీ శరీరమా? లేక నీ మనస్సా?"

"మనసే స్వామి. నా సుఖ దఃఖాలకి మూల కారణం నా మనసే." వినయంగా చెప్పిందామె.

"ఆ మనసుని తీసేస్తే అప్పుడు ఆనందాన్ని కాని, దుఃఖాన్ని కాని అనుభవించగలమా?"

"లేదు స్వామి. అప్పుడా అవకాశం వుండదు."

"నేనా మనసుని తీసేసాను. దాంతో ఆనందం, దుఃఖం లేని ప్రశాంత సమత్వ స్థితిలో వున్నాను. అందుకే నా మొహంలో ఎల్లవేళలా నువ్వు ప్రశాంతతని తప్ప ఆనందాన్ని కాని, దుఃఖాన్ని కాని చూడలేవు." వివరించాడు దిగంబర స్వామి.

"మనసుని తీసేయడం ఎలా స్వామి?"ఆశగా అడిగింది ఆమె.

"ఈ ప్రపంచంలో ఎవరికి వారు తెలుసుకునేదే తప్ప, ఇతరులు నేర్పితే రాని ఏకైక స్థితి అది. దైవభక్తి, నిష్కామ సేవలాంటివి ఆ స్థితికి తాళం చెవులు." జవాబిచ్చాడా దిగంబర స్వామి.

## 11. పనికిరాని డబ్బు

ఓ పిసినారి వ్యాపారి తన జీవిత కాలంలో ఏభై లక్షల దీనార్లని సంపాదించాడు. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం 'వచ్చే ఏడాది ఈ డబ్బుని ఖర్చు చేస్తాను' అనుకుంటూ కాలం గడపసాగాడు. అకస్మాత్తుగా ఓ రోజు మృత్యు దేవత అతని ముందు ప్రత్యక్షం అయి చెప్పింది.

"నీ ప్రాణాలు తీసుకెళ్ళడానికి వచ్చాను. నా వెంట రా."

"నాకు మూడు రోజులు గడువు ఇవ్వు. నా డబ్బుతో నేను చేయాల్సిన ముఖ్యమైన పనులు చాలా ఉన్నాయి." కోరాడా పిసినారి.

"కుదరదు. రా." ఆజ్ఞాపించింది మృత్యు దేవత.

"పోనీ ఒక్క రోజు గడువు ఇవ్వు. చాలు." బ్రతిమాలాడు.

"ఊహూ. రా."

అతని చొక్కా అంచుని పట్టుకుని లాగసాగింది మృత్యు దేవత.